
ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025



జిల్లాలో నేడు ఎస్‌సి కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి షెడ్యుల్డ్ కులాల కమిషను ఛైర్మను కెఎస్ జవహర్ ఆధ్వర్యంలో కమిటీ ఈనెల 21న శుక్రవారం జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు ఐటిడిఎ కమ్యూనిటీలో ఎస్‌సి సంఘాల ప్రతినిధులను కలుస్తారు. అదేవిధంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా అధికారులతో కలక్టరేటు మీటింగు హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. జిల్లా ప్రజలు, సంఘాల నాయకులు, ప్రతినిధులు, అధికారులు గమనించాలని కలెక్టర్ తెలిపారు.

ఢిల్లీ రైతాంగ పోరాట స్ఫూర్తితో

రైతు ఉద్యమాలు

26న ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం

మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ రైతుల పోరాట స్ఫూర్తితో రైతు ఉద్యమాలు నిర్మించనున్నామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాస్ చెప్పారు. గురువారం అఖిల భారత కిషాన్ సంయుక్త మోర్చా పిలుపు మేరకు రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనునాయుడు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బంటు దాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతాంగం చేపట్టిన వీరోచిత పోరాటం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 26న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక ప్రజాసంఘాల ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్నామని తెలిపారు. అయిదేళ్ల క్రితం రైతాంగ ఉద్యమానికి తలొగ్గి రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను మళ్లీ దొడ్డిదారిన అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా రైతాంగం కార్మికుల మద్దతుతో మళ్లీ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక అవసరాల పేరుతో వ్యవసాయ భూములను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను మానుకోవాలని, పెంచిన పని గంటలను తగ్గించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రజా సంఘాలపై నిర్బంధం విధించడం సమంజసం కాదని ఈ నిర్బంధ వైఖరిని విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదస్సులో ఎఐటియుసి నాయకులు ఆర్‌విఎస్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కార్యదర్శి బి వి రమణ, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంఘం, సిపిఐ రెడ్ స్టార్ పార్టీ నాయకులు టి.జీవ, జి.సూరయ్య, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పి.రంజిత్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ బంటు దాసు

అనుమతుల రద్దుపై మంత్రి స్పష్టంగా ప్రకటించాలి


దుగ్గేరులో 22న పవర్ ప్రాజెక్టు వ్యతిరేక సదస్సు ● గిరిజన గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

దుగ్గేరు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 22న ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దుగ్గేరులో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దుగ్గేరులో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతి ఇస్తూ జిఒ 84 జారీ చేసిందని, ఈ పవర్ ప్లాంట్‌కు అవసరమైన నీటిని వెంగళరాయసాగర్, తోటపల్లి ప్రాజెక్టు నుంచి 24 మిలియన్ క్యూబిక్ లీటర్ల నీటిని తరలించడానికి అనుమతులు ఇచ్చారని అన్నారు. రూ.25 వేల కోట్లతో 2వేల మెగావాట్లు తయారు చేసే పవర్ ప్లాంట్ దుగ్గేరు ప్రాంతంలో నిర్మిస్తే ఈ ప్రాంతంలో పనసభద్ర పంచాయతీలో గల గ్రామాలన్నీ ఖాళీ చేయిస్తారని, గిరిజన గ్రామాల్లో ఏదైనా ప్రాజెక్టు నిర్మిస్తే పీసా చట్టం, షెడ్యూల్ చట్టం ప్రకారం గ్రామసభల ఆమోదం తీసుకోవాలని అన్నారు. కనీసం గిరిజనుల అభిప్రాయాలు కూడా తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం చేస్తే ఇటు గిరిజనుల బతుకులు నాశనమవ్వడమే కాకుండా అటు వెంగళరాయి సాగర్, తోటపల్లి ప్రాజెక్టుల పరిధిలో గల ఆయకట్టు రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుల దిగువున ఉన్న భూములు ఎడారిగా మారే పరిస్థితి ఉంటుందని, ఇప్పటికే రెండు ప్రాజెక్టుల చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందడం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు దాసోహం అంటుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా హైడ్రోపవర్ ప్లాంట్ల పేరుతో గిరిజన ప్రాంతం మొత్తాన్ని అదానీ, అంబానీ కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పచెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి కొంత మంది తీసుకొస్తే ప్రజా అభిప్రాయం మేరకు ముందుకెళ్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, ఇది సరైంది కాదని అన్నారు. ఏ ప్రజా అభిప్రాయంతో జిఒ 84కు అనుమతులు ఇచ్చారని, ఏ ప్రజాభిప్రాయంతో విఆర్‌ఎస్, తోటపల్లి ప్రాజెక్టు నీరు చింతా గ్రీన్ ఎనర్జీ కంపెనీకి వాడుకోవడానికి అనుమతులిచ్చారని మంత్రిని ప్రశ్నించారు. ప్లాంట్ అనుమతులు రద్దు చేస్తున్నట్లు మంత్రి స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దుగ్గేరు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా గిరిజనులు, రైతులు కలిసికట్టుగా ఉద్యమించాలని, అటువంటి పోరాటానికి నాంది పలకడానికి ఈనెల 22న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ప్రజలంతా హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఎర్ర సామంతవలస, పనసభద్ర, దుగ్గేరు, మెండంగి, బాగుజోల, ఆలగరువు, చిలకమెండంగి, బండ మెండంగి గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు కొండగొర్రె ఆనంద్, సీదరపు పాపారావు, కొండతామర మాలతీ, సీదరపు పోలయ్య, కొండతామర సన్యాసి, కొండతామర రాజయ్య పాల్గొన్నారు



పనసభద్రలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి

మీడియా ప్రతినిధుల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సమాజానికి నిరంతరం సేవ చేస్తున్న మీడియా ప్రతినిధుల ఆరోగ్య సంరక్షణ ముఖ్యమని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి సహకారంతో జిల్లా ఆసుపత్రిలో మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో మెడికల్, సర్జికల్, ఆర్థో, కంటి, డెంటల్, ఇఎన్‌టి, చర్మవ్యాధి నిపుణులు పరీక్షలతో పాటు ఇసిజి, అల్ట్రా సౌండ్, ఎక్స్ రే, సీటీ స్కాన్ వంటివి ఉచితంగా చేస్తారని అన్నారు. నిరంతరం ఒత్తిడితో క్షేత్ర స్థాయిలో పనిచేసే మీడియా ప్రతినిధులందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షలందించే దిశగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకరులు, ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్లు, ఇతర ప్రతినిధులంతా ఈ ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మీతో పాటు మీ కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేయించి, వైద్య నిపుణులతో సలహాలు, సూచనలు పొందాలని, అవసరమైతే ఉచితంగా మందులను తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి జి.నాగభూషణరావు, డాక్టర్ టి.జగన్మోహనరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారాయణపురానికి చెందిన మండల శ్రీనివాసరావు విశాఖపట్నం మర్రిపాలెం వద్ద ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా మరణించారు. అతనికి స్టేట్ బ్యాంక్ మేనేజర్ సాయి ఖాదర్‌కు రైల్వే బీమా రూ.50 లక్షల చెక్కును అతని భార్య మండల పద్మావతికి అందజేశారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలు ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేసి, సమస్యలు భవన నిర్మాణ కార్మికుల పరిష్కరించాలని ఈ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, పి.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణకార్మికులు స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం డిఆర్‌ఒ కె.హేమలతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, యమ్మల మన్మధరావు మాట్లాడారు. మన్యం జిల్లాలో 15వేల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, గత వైసిపి హయాంలో ఇసుక క్వారీలు ఆపేసి కార్మికులకు పనుల్లేకుండా చేశారన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ గత వైసిపి ప్రభుత్వం 1214 మెమో జారీ చేసిందని, ఫలితంగా లక్షలాది మంది నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని బోర్డు ద్వారా సంక్షేమ పథకాల అమలు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు కూటమి ప్రభుత్వానికి భవన నిర్మాణ కార్మికులు ఓట్లు వేసి గెలిపించారని, 16 నెలలవుతున్నా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించి పెండింగ్ క్లైములు పరిష్కరించి, 1234 మెమో రద్దు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లు రద్దు చేయాలని, వివిధ సందర్భాల్లో గత ప్రభుత్వాలు అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని, మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్‌లు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, సూరిబాబు, గవర వెంకటరమణ, గురుమూర్తి రమేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వ్యాధి లక్షణాలు గుర్తించే లక్ష్యంగా సర్వేలు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

వ్యాధి లక్షణాలు గుర్తించేందుకే ఆరోగ్య సర్వేలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని బాలగుడబ హెల్త్,వెల్నెస్ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, సర్వేల రికార్డులు, ఆన్లైన్ నమోదు పరిశీలించారు. ఏ మేరకు వ్యాధి లక్షణాలు గుర్తిస్తున్నారు, చికిత్స, పర్యవేక్షణ వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సిడి సర్వే, ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్‌ల తీరు పరిశీలించారు. అసంక్రమిత వ్యాధులు గుర్తించేందుకు ఎన్‌సిడి సర్వే అని, రక్తపోటు, మధుమేహం, హృద్రోగ సమస్యలతో పాటు ముఖ్యంగా క్యాన్సర్ లక్షణాలు గుర్తించడంలో ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. నోటి, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ అనుమానిత లక్షణాలు ముందస్తుగా గుర్తించి కేన్సర్ ముప్పు నుంచి తప్పించే దిశగా కృషి చేయాలన్నారు. ఎన్‌ఎఫ్.హెచ్‌ఎస్ సర్వే నిర్దేశించిన లక్ష్యాలను చేరాలన్నారు. అలాగే స్కూల్, అంగన్వాడీ పిల్లల స్క్రీనింగ్‌పై ఆరా తీశారు. 4డిలైన పుట్టుక, ఎదుగుదల లోపాలు, వైకల్యాలు, ఆలస్యాలు, దృష్టి, వినికిడి, సంభాషణ, మానసిక సమస్యలు గుర్తించే లక్ష్యంగా ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్ జరపాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలు ఏమేరకు చేరుకున్నారు సంబంధిత యాప్‌ల్లో తనిఖీ చేశారు. గుర్తించిన లక్షణాలను వైద్యాధికారులు వ్యాధి నిర్ధారణ చేయాలన్నారు. లెప్రసీ సర్వే జరుగుతున్న తీరుపై తెలుసుకున్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ఏమైనా గుర్తించారా, డ్రైడే కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. అనంతరం కేంద్రంలో మందులు లభ్యతపై తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సిహెచ్‌ఒ జగదీష్, ఎఎన్‌ఎం స్వాతి ముత్యం, ఆశా కార్యకర్తలు, సిహెచ్.డబ్ల్యులు ఉన్నారు.

3న ఎన్‌జిఒ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి ఎన్జీవోల సంఘం తాలూకా యూనిట్ ఎన్నికలు డిసెంబర్ 3న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పి.ఈశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్ఎస్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్వతీపురం మండలం, టౌన్, కొమరాడ, బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన సుమారు 1500 సభ్యులు ఎన్నికల్లో పాల్గొంటారని తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, సహాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, మహిళా విభాగం అధ్యక్షులు వంటి 17 పోస్టులకు ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పోస్టులకు పోటీ చేయాలనుకున్న వారు ఈనెల 26 ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య కాలంలో నామినేషన్ దాఖలు చేసుకోవచ్చునని చెప్పారు.

ఉపాధిహామీ పనులపై 22న గ్రామసభలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల22న ఉపాధిహామీ చట్టానికి సంబంధించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎపిఒ జి.సత్యంనాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 14,209 గృహాలకు గానూ 24,824 మంది జాబ్‌కార్డు నమోదు చేసుకున్నారని, ఇప్పటి వరకు 20,250 మంది వేతనదారులు ఇకెవైసి చేసుకున్నారని, మిగిలిన వారు కూడా చేసుకోవాలని సూచించారు. 85శాతం ఇకెవైసి అయినట్లు తెలిపారు. 872 మంది వేతనదారులకు సంబంధించి మరణాలు, వలసలు తదితరమైనవి గుర్తించామని గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి ఇవి పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో పెట్టనున్నామని తెలిపారు. వీటికి సంబంధించి పూర్తిస్థాయిలో సమాచారం రాకపోతే వీటిని తొలగించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఉపాధి పనులకు సంబంధించిన వారు మాత్రమే జాబ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్లాస్టిక్ రహిత సాలూరుకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాల్టీలోని గురువారం నుంచి ప్లాస్టిక్ ఫ్రీ కార్యాలయంగా ప్రకటిస్తున్నామని కమిషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గురువారం నుంచి మున్సిపాల్టీలో ఎటువంటి ప్లాస్టిక్ వాడకం లేదా వినియోగం నిషేధించబడిందని, పట్టణంలోనూ ప్లాస్టిక్ తయారీ, అమ్మకం, వినియోగంపై నిషేధిస్తున్నామని తెలిపారు. ఇందుకు శుక్రవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్లాస్టిక్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై, కౌన్సిల్ సభ్యులతో చర్చించి, ప్లాస్టిక్ రహిత సాలూరు పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. 14ఏళ్లగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినప్పటికీ, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్లాస్టిక్ వస్తోందని, దీని నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టి, ప్లాస్టిక్ రహిత సాలూరుగా నిర్మించడమే మనందరి ధ్యేయమని అన్నారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, తడి, పొడి చెత్త విభజన, జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పాటించేలా వార్డు సెక్రటరీలకు, శానిటేషన్ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. పట్టణ ప్రజలంతా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించి, ప్లాస్టిక్ రహిత సాలూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ప్రసాదరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, వార్డు సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వెలుగు, విఒఎలకు, మహిళా సంఘాల సభ్యులకు పచ్చదనం పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించకపోతే భవిష్యత్ తరాలకు ప్రమాదం తప్పదని, కావున ప్రతి గ్రామం, ప్రతి ఇంటిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించి పచ్చని గ్రామాలుగా తీర్చిదిద్దడానికి వెలుగు సంఘాల మహిళలు ప్లాస్టిక్ నిషేధంపై గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రజల్లో మార్పు తీసుకురావడంలో మహిళల భాగస్వామ్యం ముఖ్యమని పేర్కొన్నారు.

సీతానగరం : ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనార్థాలపై డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగభూషణరావు అవగాహన కల్పించారు. మండలంలోని మరిపివలస, సూరంపేట గ్రామాల్లో గురువారం ఆయన హోటల్ ప్రాంతాల పాన్ షాపుల యజమానులకు ముందుగా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలు రకరకాల అనర్థాలకు గురవుతారని, వీటిని మీరు షాపుల్లో అమ్మరాదని అన్నారు. అటువంటి వారికి నోటీసులు ఇచ్చి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రీన్ పంచాయతీల్లో భాగంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్లో కొంతమంది షాపు యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు అలాగే స్వర్ణ పంచాయితీ వెబ్సైట్ ద్వారా ఇంటి పన్నులు వసూలు చేయాల్సిందిగా పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



సాలూరు : శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది



సీతానగరం : పాన్‌షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న డిఎల్‌పిఒ

సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ ఆందోళనలు

విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన


ప్రజాశక్తి - కురుపాం

తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ ఆందోళనలు చేపడతామని విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కె.జయకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కోసం విఆర్‌ఎలు దీర్ఘకాలికంగా పోరాడుతున్నా కనీసవేతనాలు పెంచడం, అర్హత కలిగిన వారికి ఉద్యోగోన్నతి కల్పించడం పట్ల పాలకులు చొరవచూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా, ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదన్నారు. కావున సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘ మండల అధ్యక్షులు జి.సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు, డిఎతో కూడిన జీతం, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించి ప్రమోషన్లు ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ విఆర్‌ఎలు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారి రత్న కుమారికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, విఆర్‌ఎల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరిధిలో గల రైతులకు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న విఆర్‌ఎలకు ఏడేళ్లుగా వేతనాలు పెరగలేదన్నారు. కేవలం రూ.11వేలు జీతంతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన్యం జిల్లాలో ప్రమోషన్లు, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్ కంప్యూటర్ ఆపరేటర్ లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విఆర్‌ఎల కష్టాలు తీరుతాయని ఆశించినా 14 నెలలు గడుస్తున్నా నేటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, కావున విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు విఆర్‌ఎలు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేస్తున్న విఆర్‌ఎలు



కురుపాం : తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న విఆర్‌ఎలు

5320 కిలోల పిడిఎస్ బియ్యం సీజ్

సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడు వలసలో కొట్టానా శ్రీనివాసరావు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 133 బస్తాలతో కూడిన సుమారు 5320 కేజీల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్టు ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపారు. ప్రజా పంపిణీ నిమిత్తం ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న బియ్యంగా గుర్తించామన్నారు. దీనిపై తదుపరి చర్యలు నిమిత్తం తహశీల్దార్‌కు బియ్యాన్ని, ముద్దాయిని అప్పగించినట్లు తెలిపారు .


పార్క్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్రెడ్డి

పార్కులను మరింత అందంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని పార్కులను మరింత అందంగా తీర్చిదిద్ది, ప్రజలకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నర్సిపురం చెరువు, చర్చి వీధితో పాటు పలు ప్రాంతాల్లోని పార్కులను కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవాసులకు శుభ్రమైన, పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా పార్కులు ఉండాలన్నారు. నగరంలోని అన్ని పార్కులు మరింత అందంగా కనిపించాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. కొత్త రకాల పూల మొక్కలు, నీడనిచ్చే చెట్లను వేసేలా ప్రణాళికలు చేయాలన్నారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్లు, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పిల్లల ఆట వస్తువులు ఉండాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై నేడు శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో చెత్త సంపద కేంద్రంలో ఈనెల 21న పచ్చదనం పరిశుభ్రతపై గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపిడిఒ బి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండలంలోని అన్ని సంపద కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభలు

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లో తలపెట్టిన పనులపై శుక్రవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎపిఒ ఎ.బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన పనులు ముందుగా సిబ్బంది ఎమ్బుక్ ఇవ్వాలని, అందుబాటులో ఉన్న పనుల వివరాలు అందజేయాలని అన్నారు. అలాగే కొత్తగా జాబ్ కార్డులు కావాల్సిన వేతనదారులు గ్రామసభలోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాబు కార్డు ఏ కారణం చేతనైనా డిలీట్ జరిగితే మళ్లీ ఆ కార్డును యాక్టివ్ చేయడానికి ఈ గ్రామసభల ద్వారా జరుగుతుందన్నారు. ఇప్పటికే జాబ్ కార్డులు తొలగించిన వారి పేర్లు గ్రామ సచివాలయ బోర్డులో అంటించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇసి సోమేశ్వరరావు, టెక్నికల్, టీఏ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మూడురోజుల క్రితం జరిగిన ఎదురు కాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా మృతి చెందిన ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమైనట్లు ఎస్పీ మాధవ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు గురువారం మండల కేంద్రానికి సమీపంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, అలాగే వారాంతపు సంతలో డ్రోన్ సహాయంతో పరిస్థితులను నిఘాలో భాగంగా పర్యవేక్షించమన్నారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఎస్ఐలు సాయి కుమార్, కిరీటి, సత్తిబాబు, సిబ్బంది గిరి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు సమీపంలో గురువారం స్థానిక ఎస్ఐ జి.కళాధర్ ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అందుబాటులో పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతి వేగం కారణంగా నెమ్మదిగా వాహనాలు నడపాలన్నారు. వాహనాలకు సంబంధించిన పెండింగ్లో ఉన్న చలానాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు కుష్టు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కిరణ్మయి

కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - బలిజిపేట

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని, అపోహలు వీడి చికిత్స పొందాలని స్థానిక పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి తెలిపారు. మండలంలోని నారాయణపురంలో గురువారం ఈ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి లెప్రసీపై అవగాహన కల్పించారు. అనంతరం జడ్పీహెచ్ స్కూల్ సందర్శించి విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. రక్తహీనత, పచ్చకామర్లు, సీజనల్ వ్యాధులపై పరిశుభ్రతల గురించి అవగాహన జరిపారు. ఇది భయంకరమైన వ్యాధికాదని చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందని విద్యార్థులకు మలేరియా, టిబి, ఎనీమియా, పచ్చకామెర్లు అంటూ వ్యాధులపై అవగాహన, 15 ఏళ్ల నుంచి 26 వయసు వారికి అవగాహన కల్పించడం మంచిదని, వీరు దేశ భవిష్యత్తుకు ఆధారపడి ఉంటారని తెలిపారు.

పెద్దమ్మ, పిన్నమ్మ తల్లి కొండల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని తుంబకొండ పంచాయతీ తుంబకొండపై గల పెద్దమ్మ, పిన్నమ్మతల్లి కొండలను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కొండపైన మన్యం అందాలు బాగున్నాయన్నారు. ఇక్కడ గుడి నిర్మించాలని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కాలేజీని సందర్శించిన డిఐఇఒ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాశాఖ అధికారి వై.నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కళాశాలలో జరుగుతున్న అర్ధ సంవత్సర పరీక్షల నిర్వహణ విధానాన్ని పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేపట్టి పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థుల హాజరు, ప్రశ్నాపత్రాల భద్రత వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

21న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఈనెల 21న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్థానిక ట్రాన్స్కో ఎఇ కె.సోమేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం ఉప కేంద్రంలోని ట్రాన్స్ఫార్మర్లు, యార్డు నిర్వహణల వంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఉప కేంద్రం పరిధిలోని 11కెవి వీరఘట్టం, 11 కెవిఎస్ నర్సిపురం, 11 కెవి కడకల్లా, 11 కెవి బిటివాడ ఫీడర్ పరిధిలో గల అన్ని గ్రామాలకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ అంశాన్ని వినియోగదారులు గ్రహించాలని ఆయన కోరారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంచుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆఖరు రోజు ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎం.ఆనందరావు మాట్లాడుతూ పిల్లలు పంచతంత్రం, భగవద్గీత, వింగ్స్ ఆఫ్ ఫైర్ లాంటి పుస్తకాలు లైబ్రరీలో పుస్తకాలు చదవాలని, పెద్ద బాలశిక్ష, రామాయణం వంటి కథలేకాకుండా ఫిక్షన్, నాన్ఫిక్షన్ కథలు చదవాలన్నారు. అవి చదివితే విజ్ఞానం పెరుగుతుందన్నారు. అలా మనకు పుస్తకాలు చదవడం అలవాటుగా మారుతుందన్నారు. ఇవే కాకుండా ఒక ప్రదేశం కోసం రాసిన పుస్తకం చదివి మంచి విషయం గ్రహించుకోవచ్చని, ఓ పుస్తకం చదివిన తర్వాత దాని నుంచి మనం ఏం నేర్చుకున్నామన్నది ముఖ్యమని అన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకట రావు మాట్లాడుతూ యోజన మ్యాగజైన్ పత్రిక చదవాలని ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుస్తుందని, కొత్త విషయాలను ఎలా డీల్ చేయాలో తెలుస్తాయని తెలిపారు. పదో తరగతి పిల్లలకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత గ్రంథాలయాధికారి పి.శ్రీరాములను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు, స్కూల్ అసిస్టెంట్లు శివకుమార్, అభిమన్యు, వెంకట రత్నం, ఎ.గౌశంకర్, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్బాబు, సహాయకుడు రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఎంపిపి బి.ప్రమీల, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సంతోషిని, ఎంఇఒ సతీష్, బి.మన్మధరావు, ఉదయ కుమార్, సూర్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి తదితరులు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ వారోత్సవాలు సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


బలిజిపేట : ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్

బలిజిపేట : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో మన భారత దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు ఖోఖో, పరుగు పందేలను నిర్వహించారు. అలాగే సర్దార్ వల్లభాయి పటేల్ 150 జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాయాధికారి బి.రాజగోపాల్, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, వినీత, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఇఒ ఆనందరావు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులను పంపిణీ చేశారు. లైబ్రేరియన్ సుకన్య మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు ఎంతగానో వినియోగించుకున్నారన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చి వార్తాపత్రికలు, విలువైన పుస్తక సమాచారం చదివి విజ్ఞాన పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి స్కూల్ హెచ్ఎం సన్యాసి అప్పడు, ఉపాధ్యాయులు, సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.


రాళ్లు తేలిన రోడ్డుమీదుగా పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

రాళ్లు తేలిన రోడ్డుపై గిరిజన విద్యార్థుల బడిబాట

ప్రజాశక్తి - పాచిపెంట

సుమారు రెండు కిలోమీటర్లు రాళ్లు తేలిన రహదారిపై చిన్నారులు బడికి పోవాల్సిన దుస్థితి మర్రిపాడులో చోటు చేసుకుంది. మండలంలోని గరిసగుడ్డి పంచాయతీ మర్రిపాడు గిరిజన గ్రామానికి చెందిన స్కూల్ పిల్లలు ప్రతిరోజు స్కూలుకు వెళ్లాలంటే మర్రిపాడు నుంచి సుమారు రాళ్లు తేలిన రహదారిపై రెండు కిలోమీటర్ల దూరం ఉన్న జీలికివలసలో ఉన్న స్కూల్కు రాళ్లు రప్పలు దాటుకుంటూ వెళుతున్నారన్నారు. రాళ్ల మీద నడవడంలేక తీవ్ర ఇబ్బందులు గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్నారన్నారు. పక్కా రహదారి నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మర్రి రాజు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి. అధికారులకు విజ్ఞప్తి చేశారు. వర్షాలు పడినట్లయితే రాళ్లు పైకి తేలిపోయి నడవడం చాలా కష్టమని, యువత కూడా నడవడం ఇబ్బందిపడుతున్న పరిస్థితుల్లో స్కూల్కు వెళ్లాలంటే పిల్లలు ఎన్ని కష్టాలు పడాలో అర్థం చేసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు, మర్రిపాడుకు చెందిన గిరిజన యువత పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు జరగకుండా ట్రెంచ్ ఏర్పాటు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కెఆర్బి పురం ఇసుకరీచ్ నుంచి ఎటువంటి అక్రమ ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు స్థానిక తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కూనేరు రామభద్రపురం వద్ద ఉన్న ఇసుక రీచ్కు వాహనాలు అక్రమ ఇసుక రవాణా జరగకుండా అధికారులు జెసిబి సహాయంతో ట్రెంచ్ కొట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇసుకరీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేవలం ట్రాక్టర్లతో మాత్రమే ఇసుకను తీసుకువెళ్లేందుకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి తప్ప లారీలతో తరలించేందుకు అనుమతుల్లేవని తెలిపారు.

ఎస్సి కమిషన్ చైర్మన్ను సత్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎస్సి కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ను స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర గురువారం మర్యాదపూర్వం కలుసుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే స్వగ్రామం నర్సిపురంలో జవహర్కు ఘనంగా స్వాగతం పలికారు. చైర్మన్ కు పూలమాలవేసి స్వాగతం పలికారు. మొదటిసారిగా మన్యం జిల్లాకు విచ్చేసిన కె ఎస్ జవహర్ ను ఎమ్మెల్యే విజయచంద్ర శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి ఘనంగా సత్కరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారాయణపురానికి చెందిన మండల శ్రీనివాసరావు విశాఖపట్నం మర్రిపాలెం వద్ద ఆర్పిఎఫ్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తుండగా మరణించారు. అతనికి స్టేట్ బ్యాంక్ మేనేజర్ సాయి ఖాదర్కు రైల్వే బీమా రూ.50 లక్షల చెక్కును అతని భార్య మండల పద్మావతికి అందజేశారు.

భూ రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గజిలిలో భూరీసర్వే ప్రక్రియను సెంట్రల్ డిప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాసులు రెడ్డి గురువారం పరిశీలించారు. గజిలిలో రీసర్వే భూములను, కొలతలను పరిశీలించారు. భూతగాదాల్లేకుండా గ్రామాల్లో రైతులకు గ్రామ సభలు నిర్వహించి సర్వే సక్రమంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో డిఎస్ఎల్ఒ పి.లక్ష్మణ రావు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీవిద్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెదమరికికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని పెదమరికి గ్రామస్తులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం పెదమరికిలో రూ.25 లక్షల సిఎస్ఆర్ నిధులతో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెదమరికి గ్రామస్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని ఈ శాశ్వత అంగన్వాడీ భవన నిర్మాణానికి శ్రీకారం ,చుట్టామని, మరి కొన్ని నెలల్లో ఈ భవన నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభోత్సవం చేస్తానని తెలిపారు. అలాగే వరహాలగెడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తామని, ఇది జరిగితే ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉందని, దీనికోసం అసెంబ్లీలో కూడా చర్చించినట్టు తెలిపారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం సిఎస్ఆర్ నిధులు తెచ్చిన దాఖలాల్లేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎస్ఆర్ నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. అలాగే ఇతర కంపెనీలతో కూడా మాట్లాడి వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందడానికి నిరంతరం కృషి చేస్తానని, దీనికి ప్రజల సహాయ సహకారాలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు..


అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు సచివాలయాలను ఎంపిడిఒ స్వరూపారాణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయానికి హాజరు కావాలని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలనీ సూచించారు. డోర్ టు డోర్ కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఆధార్ కేంద్రాన్ని సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గురువారం ఎంఇఒలు నాగభూషణరావు, పి.బాల భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ బయోమెట్రిక్ అప్డేషన్ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణ కిచెన్ గార్డెన్, పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ పరిశీలనలో సిఆర్పి రాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సి కమిషన్ చైర్మన్ను కలిసిన దళిత నేతలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎస్సి కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ని కలిసి దళితుల సమస్యలను వివరించినట్లు జైభీంరావు భారత్ పార్టీ నాయకులు కనిగిరి శ్రీనివాస రావు తెలిపారు. గురువారం జెడ్పీ గృహంలో ఆయన్ను కలిసి సమస్యలు వివరించామన్నారు. మండలంలో దళితులపై జరిగిన దాడులు, భూకబ్జాలు వంటి సమస్య లను ఆయన దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో జైభీమ్రావుభారత్ నాయకులు కనిగిరి చిన్నమాలచ్చి, జగ్గారావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

కెజిబివిని పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక కెజిబివి పాఠశాలను ఎంఇఒ త్రినాధ రావు గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఎస్ఎ 1 పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేశారు. హాజరు తీరు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార మెనూను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి ఉన్నారు.

స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని 31 గ్రామ పంచాయతీలు స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రాధాన్యంగా తీసుకొని థీమ్-5లో భాగంగా "పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామ పంచాయతీలో భాగంగా రెండో రోజు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిక్షణలో మండలంలో గల 31 గ్రామ పంచాయతీల్లోని సర్పంచులకు, ఉప-సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్ గార్డులకు, ఎంఆర్సిలకు, విఒఎ, వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం భవనంతో పాటు వెలుగు కార్యాలయంలో రెండు గ్రూపులుగా శిక్షణ మూడు రోజులు జరుగుతుందని తెలిపారు. పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ నుంచి సర్పంచి, పంచాయతీ కార్యదర్శి వరకు ఉన్న అంతా సమన్వయంతో పంచాయతీలను పరిశుభ్రంగా స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దుకునేందుకు కృషి చేయాలని కోరారు. జెడ్పిటిసి సభ్యులు డి.లక్ష్మి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : గ్రామాల్లో పరిశుభ్రత ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రతగా ఉంచాలని, అలాగే గ్రీన్ అంబాసిడర్ ద్వారా గ్రామాల్లో చెత్తా, చెదారం శుభ్రం చేయించి తడి, పొడి చెత్తను వేరుచేసి ఆర్థిక వనరుగా మార్చాలని అన్నారు. ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్ ద్వారా గ్రామాలను శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్పర్సన్ మనోహర్ ఎ.శశిభూషణరావు, గ్రామ సమైక్య మహిళా సంఘ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


గాలింపు చర్యలు పరిశీలిస్తున్న ఎస్ఐ నీలకంఠం

నాగావళిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని బియ్యాలవలసకు చెందిన మండంగి అన్నపురాయుడు (65) గురువారం గల్లంతైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే అన్నపు రాయుడు పార్వతీపురం పశువుల సంతకు వెళ్లి పశువులు కొనుగోలు చేసి స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో ఉన్నాడు. ఈ క్రమంలో కల్లికోట వద్ద ఉధృతంగా ప్రవహించే నాగావళి నదిని దాటుతుండగా వరద ప్రవాహానికి కొట్టుకుపోయి అదృశ్యమైనట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే కొమరాడ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్సై నీలకంఠం సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు ప్రారంభించారు. నాగావళి నది తీరం వెంట అన్వేషణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండలో జరిగిన రెండు వేర్వేరు ఘటనకు సంబంధించి దొంగలను పోలీసులు గురువారం పట్టుకొని అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులు సమావేశంలో వివరాలను డిఎస్పి ఎం.రాంబాబు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకుకు చెందిన తోట ప్రసాదు పట్టణంలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేశారు. గురువారం రాజపురం జంక్షన్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో ప్రసాద్ వాహనం తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు లేకపోవడంతో విచారణ చేశారు. దీంతో పాలకొండకు చెందిన నాలుగు ద్విచక్ర వాహనాలు, జలుమూరుకు చెందిన ఒక వాహనం దొంగలించినట్లు గుర్తించారు. అదేవిధంగా పట్టణంలోని వాంద్రంకు వీధిలో ఒక వృద్ధురాలి ఇంట్లో ఈనెల 15న బంగారం దొంగతనం జరిగింది. వృద్ధురాలి మనవడు సాయికిరణ్ దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న పావు తక్కువ మూడు తులాలు బంగార ఆభరణాలు అపహరించాడు. సిసి కెమెరా ఫుటేజ్ ఆధారాలతో దొంగను గుర్తించారు. ఈ రెండు కేసులు ఛేదించిన కానిస్టేబుళ్లు రాజేష్, కృష్ణ సాహూకు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ రాత్రివేళల్లో వాహనాలకు తాళాలు వేసి భద్రపర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో పాటు సిఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి, ట్రైనీ ఎస్సై హేమలత ఉన్నారు.

సారాతో పట్టుబడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టంలోని రెల్లి వీధికి చెందిన వ్యక్తి 15 లీటర్ల నాటు సారా తరలిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు వలపన్ని పట్టుకున్నట్లు ఎస్సై జి.కళాధర్ గురువారం తెలిపారు. సారాతో పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్ఐతో పాటు హెచ్సి కృష్ణంనాయుడు ఉన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట నేలమట్టం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఎగువ దారబ సమీప కొండల్లో 600 లీటర్లు బెల్లం ఊటలను ఎస్ఐ వై.అమ్మన్నరావు తన సిబ్బందితో నేలమట్టం చేశారు. పది లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎస్ఐ మాట్లాడుతూ సందర్భంగా సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా నిర్మూలనకు అంతా సహకరించాలని కోరారు. ఎస్ఐతో పాటు పోలీస్ ఇబ్బంది ఉన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బలిజిపేట

విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వరకు జరగనున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలంటూ సిఐటియు నాయకులు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.దాలమ్మ, కో కన్వీనర్ యు.లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో జరుగుతాయని, ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని విమర్శించారు. 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం కార్మికులను దగా చేయడమేనన్నారు. జిల్లా లో చెప్పుకో దగ్గ పరిశ్రమల్లేవని, ఉన్న షుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీ మూతపడ్డాయని, దీంతో వేలాది మంది పొట్ట చేత పట్టుకుని వలసలు పోతున్నా రన్నారు. అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయాలని పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు నాయకులు పి. వెంకటస్వామి, సత్యం, నల్ల ఈశ్వరరావు, ఆశ్రయ, ఇందిరా, సావిత్రి, ప్రమీల, శారద, పాలమ్మ, లక్ష్మి, మజ్జమ్మ, పాల్గొన్నారు.


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పెద్దమార్కెట్ పెద్దలకేనా? : జనసేన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని పెద్ద మార్కెట్ దుకాణాల విషయంలో దశాబ్దాలుగా జరుగుతున్న అక్రమాలపై అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని జనసేన నాయకులు రేగు మహేష్, రిపబ్లికన్ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాష్ ప్రశ్నించారు. గురువారం సాలూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో సుమారు 70ఏళ్లుగా పెద్దమార్కెట్లోని షాపులను వేలం వేయకుండా, ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, దీనిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశామని తెలిపారు. పెద్ద మార్కెట్లో సుమారు 155 షాపులు ఉన్నాయని, వీటిని కూలగొట్టి కొత్తగా నిర్మిస్తే దాదాపు 300 షాపులు అవుతాయని, మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఈ షాపులు కేవలం ఒకే సామాజిక వర్గం చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించిన వారినే కొనసాగిస్తున్నారని, ప్రభుత్వ జీవోల ప్రకారం, 25ఏళ్లు నిరవధికంగా లీజులో ఉన్నవారిని ఖాళీ చేయించాల్సి ఉన్నప్పటికీ, స్థానిక మున్సిపల్ అధికారులు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కారణం ఈ ఆక్రమణదారులు స్థానిక ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు లంచాలు ఇవ్వడమేనని, షాపు లీజుదారులు మున్సిపాలిటీకి నామమాత్రంగా రూ.500 చెల్లిస్తూ, వీరు మాత్రం దుకాణాలకు రూ.5వేలు వరకు అద్దెలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి 10 షాపుల వరకు ఉండడం వల్ల, వారి ఆదాయం నెలకు లక్షల్లో ఉందని, దీనివల్ల మున్సిపాలిటీకి లక్షలాది రూపాయల నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్కెట్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెద్ద మార్కెట్ను ఆక్షన్ వేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.